ఊరేగింపు

పట్టణపు చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహం మెడలో ఎన్నికల్లో నిలుచోబోయె అభ్యర్థి పూలదండ వేయగానే చుట్టు నిలుచున్న వాళ్లు చప్పట్లు కొట్టారు.

"డా॥ బాబాసాహెబ్ అంబేద్కర్"

"అమర్ హై" అంటూ జోహార్లు పలికారు.

"పేదలంతా" కార్యకర్త.

"ఒక్కటై" గుంపు.

"ఉన్నవాని అధికారం సాగనివ్వం" కార్యకర్త.

"సాగదు యిక సాగదు" గుంపు.

పోటి చేస్తున్న అభ్యర్థి ముందు నడువగ డప్పు కొమ్ములతో

ఊరేగింపు మెయిన్ రోడ్ గుండా వెడుతువుంది.

దుకాణాదార్లు బయటికి వొచ్చి ఊరేగింపును చూస్తు నినాదాలు వింటున్నారు. బజారులో జనం గుంపులు, గుంపులు గుసగుసలు.

"వరసగా మూడుసార్లు గెలిచిన పార్టీ ఈ వూరికి ఏం చేయలేకపోయింది. ఆ పార్టీ కాదని ప్రాంతీయ పార్టీ అభ్యర్థిని గెలిపిస్తే ఆయనే ముఖ్యమంత్రి అయ్యి కూడ ఏం చెయ్యలేక పాయే. ఈసారి కొత్త మనిషి, కొత్త పార్టీ", "చూద్దాం" అంటూ ఒకరితో మరొకరి మాటలు.

ఈలోగా ఊరేగింపు రెవిన్యూ ఆఫీసు చేరింది. డప్పులు, కొమ్ములు ఆపేసి నినాదాలు ఇస్తు పక్కనే వున్న చెట్ల కిందికి చేరారు. అభ్యర్థి మరో నలుగురితో కలిసి ఆఫీసర్ గది వైపు నడిచారు.

అప్పటికే అధికార పార్టీ అభ్యర్థి రంగారెడ్డి, బ్యాండు మేళంతో వచ్చి నామినేషన్ వేసి ఆఫీసు ఎదురుగా వున్న వేప చెట్టు క్రింద తన పార్టీ కార్యకర్తలతో నిలుచోని పరిస్థితిని చర్చిస్తున్నారు.

అంతకు ముందే మొదట మిత్రపక్షాల తరపున దేవశర్మ నామినేషన్ వేసి వెళ్లారట.

మళ్లీ నినాదాల శబ్దం.

అభ్యర్థి లోపలికి వెళ్లి తన నామినేషన్ పత్రాన్ని రిటర్నింగ్ అధికారికి అందజేసి, పత్రికల వారి కెమెరాల వైపు నవ్వుతూ

చూశాడు.

"సత్యాజీ గారు మీరేనన్న మాట" అంటు అభ్యర్థి వైపు చూస్తూ ఎన్నికల అధికారి నామినేషన్ పత్రాన్ని అందుకున్నాడు.

అవును అన్నట్లు తలవూపి చిన్నగా నవ్వాడు సత్యాజీ.

"మీ పార్టీ గురించి పత్రికల్లో చూస్తూనే వున్నాం" అధికారి

"ఈసారి అధికారం మా పార్టీ చేతుల్లోకి రానున్నది" నవ్వు ముఖంతోనే కుర్చీలోంచి లేస్తు అన్నాడు.

"ఇది ప్రజాస్వామ్యం" అంటూ కాస్తా కదిలి కూర్చున్నాడు అధికారి.

బయట నినాదాలు....

"సాధిస్తాం, సాధిస్తాం" కార్యకర్త.

"రాజ్యాధికారం సాధిస్తాం" గుంపు.

"ఓట్లు మావి" కార్యకర్త.,

"సీట్లు మావే" గుంపు.

కార్యాలయంలో పని చేసే వాల్లందరూ ఒక్కసారే బయటికొచ్చి అభ్యర్థులను చూస్తు నిలుచున్నారు.

ఆ నినాదాలు అక్కడే నిలుచున్న రాంరెడ్డిలో కాస్తా ఆందోళన లేపాయి.

"అవును ముందెన్నడు లేని ఈ కొత్త పార్టీ, అన్ని కులాల వాళ్లు, ముఖ్యంగా మైనార్టీలైన క్రిస్టియన్లు, ముస్లింలు ఈ పార్టీలోనే వున్నారు. వాస్తవంగా ఓట్లన్నీ వాల్ల చేతుల్లోనే. ఏం జరుగుతుందో" అన్నాడు రెడ్డి.

"ఏం జరుగదు, అధికార పార్టీని ఓడించడమంటే మాటలా ఏంటి ?" అన్నాడు ఓ కార్యకర్త.

"చెప్పలేం" మరో కార్యకర్త.

"ఈసారి పరిస్థితి వేరు!" రాంరెడ్డి.

★ ★ ★

అది కొత్తగా కట్టిన భవంతి, చుట్టు ప్రహరీ గోడ. కారు వెళ్లేంత గేటు. లోపల ఏపుగా పెరిగిన టేకు చెట్లు వున్నాయి.

ఉదయం పూట సత్యాజీ ఇంట్లోనే వుండొచ్చు. అనుకుంటు కాలింగ్ బెల్ నొక్కాను. పక్షి అరిచినట్టు శబ్దం.

ఆఫీసు గదిలో నుండి బయటికి వొస్తు నన్ను చూసి సత్యాజి..

"రండి, రండి" అంటూ ఎదురొచ్చి లోపలికి తీసుకెళ్లాడు.

"రాజకీయాల్లో దిగినట్టుంది" అంటూ సత్యాజీ సైగతో చూపిన కుర్చీలో కూర్చొంటు అన్నాను.

"దిగకూడదా?" అంటూ ఎదురు కుర్చీలో కూర్చున్నాడు.

"అబ్బె దిగకూడదని కాదు, కానీ వ్యాపారం"

"రెండింటిని నడిపిస్తాం"

"మీరు రాజకీయాలకు కొత్త. మీ పార్టీ ఎన్నికల్లో కొత్త"

"ఏదైనా మొదట కొత్తే కదా ?" అంటు అప్పటి వరకు టీపాయ్ మీదున్న పెన్నును జేబుకు పెట్టుకుంటు అన్నాడు.

"కాస్త కష్టమే" అంటు తన చేతిలోని ఓపక్ష పత్రికను టీపాయ్ మీదుంచాను.

పత్రిక ముఖ చిత్రం మీదికి దృష్టిని మరలుచుతూ..

"మీరు తెచ్చిన పత్రిక మీద మా నాయకుని బొమ్మ! ప్రముఖ పత్రిక ముఖ పత్రంగా వేస్తున్నారంటే మీకు అర్థమయ్యే వుంటుంది మా నాయకుని గూర్చి. చెల్లాచెదురుగ వున్న మనలను ఒక్క తాటి మీదికి తెచ్చాడు" అంటూ సూటిగ నా ముఖంలోకి చూస్తు కనుబొమ్మలను కదిలించాడు.

"ఈ పార్టీ మీద నాకు నమ్మకం లేదు".

"గెలిచి తీరుతాం అని పార్టీ ప్రకటించింది" చెపుతున్నప్పుడు వొచ్చిన చిన్న ఆవలింతకు చేయి అడ్డం పెట్టుకున్నాడు.

"ఎన్నికల్లో పోటి చేసే ప్రతి పార్టీ గెలుస్తాం అనే అంటారు" అన్నాను. సత్యాజీ నా వైపు అదో మాదిరిగ చూసాడు.

"మరోలా బావించొద్దు, నాకు తెలిసింది నేను మాట్లాడుతున్న". సూటిగ ఆయన ముఖంలోకి చూస్తు అన్నాను.

"తన మన తెలియకుండానే పోటి చేస్తామా ?"

"లెక్క పెట్టే రోజు పెట్టె తెరిస్తే తెలుస్తుంది".

"అది గతంలో" పత్రికపై వున్న తమ నాయకుని బొమ్మను రెప్పవాల్చకుండా చూస్తు అన్నాడు.

"యిప్పుడు మీ పార్టీ ప్రత్యేకత ఏమిటో".

"అందరం ఒక్కటైనాం, ఓట్లు మన చేతుల్లో వున్నాయి. మనమే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాం." కుడి చేతిని పిడికిలి బిగించి బల్లపై ఆనిస్తు అన్నాడు.

"గతంలో ఓట్లు మన చేతుల్లో లేవా ?"

"ఉండే కానీ అప్పుడు మనకో జాతీయ స్థాయి పార్టీ లేదు, జాతీయ నాయకుడు కూడా లేడు".

"లేబర్ పార్టీ, ఆ తరువాత రిపబ్లికన్ పార్టీ ఏ స్థాయివి? వాటి వ్యవస్థాపకుడు డా॥ అంబేద్కర్ జాతీయ నాయకుడు కాడా ?"

సత్యాజీ మాట్లాడకుండా ఆలోచనల్లోకి వెళ్ళాడు.

"అసలు మన జనం సంగతి మీకు సరిగా తెలియదు, ఆయన్నే ఆరోజుల్లో గెలిపించలేక పోయారు".

"అప్పుడు వాళ్లకు ఓటు విలువ తెలియక అమ్ముడు పోయే వాళ్లు".

"ఇప్పుడు మాత్రం......."

"అలా జరగదు. ఓటు విలువ తెలుసుకున్నారు".

"లేద్దు బ్రదర్ ఇన్నాళ్ల కాలం కాదు, మీరు ఇప్పుడు గ్రామాల్లోకి వెళ్లి చూడండి, చాకిరీ కులాలన్నీ ఏకమైనాయి, మేం ఏ వూరు వెళ్లినా డప్పులు, కొమ్ములతో ఎదురుకోళ్లు, కూలి మాని ఆ రోజంతా సమావేశమై ఎలాగైనా రాజ్యాధికారాన్ని రాబట్టు కోవాలే.

స్వాతంత్ర్యం వొచ్చి ఇన్నాళ్లైంది. మన బతుకుల్లో మార్పు రాలేదు.

ఓ వూల్లో వేయి వోట్లు అందరివైతే అందులో యాబది ఓట్లువున్న రెడ్డి గారు గెలుస్తాడు. మరికొన్ని ఊళ్లల్లో పది ఓట్లున్న వెలమ లేదా కమ్మ గెలుస్తాడు. ఇంకా చెప్పాలంటే

ఒకే ఒక ఇల్లున్న వెనకటి కరణం సర్పంచ్! యిలా వుండడానికి వీలు లేదు. వందల ఓట్లున్న మనం అంటే బహుజనుల్లో నుండే సర్పంచ్ కావాలే, అట్లనే వేల ఓట్లున్న వాళ్లల్లో నుండే ఎం.ఎల్.ఏ. కావాలే, అట్లనే లక్షల ఓట్లున్న వర్గం వాడే ఎం.పి. కావాలే.....

అంత... వీళ్ళే అయ్యి ఢిల్లీ గద్దెను ఎక్కి రాజ్యపాలన జరపాలని పట్టుబడుతున్నారు. చేయి, చేయి, కలిపి నడుస్తున్నారు. మమ్ములను ముందు నడిపిస్తున్నారు. అందువల్ల ఈసారి మన పార్టీదే గెలుపు. మీరు కూడా మా వెనక వుండి బహిరంగ సభల్లో మీ కవితల ద్వారా జనాన్ని ఏకం చేసి గెలిచేటట్టు చూడాలి" అంటు ఓ మాదిరి ఉద్రేకపు ఉపన్యాసాన్ని యిచ్చాడు.

"మన వాళ్లు యిప్పట్లో ఏకం కారు"

"మీరు చూస్తు వుండండి.

మా పరుగును మేం కొనసాగిస్తాం" అంటూ లేచాడు సత్యాజీ.

"కవితలు అన్నందుకు గుర్తొచ్చింది....

"కవితలు విని పిడికిళ్లు బిగిస్తారు.!

ఉపన్యాసాలు విని చప్పట్లు కొడతారు!

ఎన్నికలు వచ్చాయంటే

అటో యిటో ఎటో !

గెలిచిన వాడి వూరేగింపులో ఎగిరి గంతులేస్తారు".

★ ★ ★

పోలింగ్‌కు మూడు రోజుల ముందు ప్రచారాన్ని ఆపివేసింది ప్రభుత్వం. అభ్యర్థుల ఇళ్ల నుండి ఊసిల్లలాగ లేసిన నోట్లు కార్యకర్తల చేతుల్లోవాలి అక్కడ పోల్ చీటీలను కరుచుకొని ఓటర్ల ఇళ్లల్లోకి దూరాయి.

ఆరోజు పోలింగ్ టౌన్ అంతా హల్‌చల్‌గా వుంది. అభ్యర్థులు ప్రతిబూతును దర్శిస్తూ ఓటర్లను చిరు నవ్వుతో మందిలిస్తు తిరుగుతున్నారు.

జనం పోలింగ్ బూతుల వద్ద క్యూలల్లో నిలుచున్నారు. చురుకుగా పోలింగ్ జరుగుతు వుంది.

రాంరెడ్డి గారు, శర్మగారు, సత్యాజీ ఎవరికి వారే తమ, తమ కార్యకర్తలు తెచ్చే వార్తలకు తృప్తిగ శ్వాస పీలుస్తున్నారు. మధ్య మధ్యన స్వయంగా పోలింగ్ బూతులను దర్శిస్తు భరోసాను భర్తీ చేసుకుంటున్నారు. పూర్తి పేర్లతోటి, పాత వరసలతోటి ఓటర్లను పలకరిస్తున్నారు.

ఆరోజు సత్యాజీ గారింట్లో ఎన్నికల గూర్చి, ఆయన పోటిలో నిల్చోవడం గూర్చి మాట్లాడినందుకు ఏమనుకున్నాడో ఏమో, ఎపుడైనా ఎదురైతే ముఖం తిప్పుకుంటున్నాడు.

నేను ఓటువేయడానికి వెలుతూ వుంటే మధ్యలో సత్యాజీ కారు నడుపుకుంటు ఎదురొస్తు, రిక్షా అడ్డం రాగానే ఆపుకుని హారన్ ఇస్తువున్నాడు.

సరిగ్గా అప్పుడు ఆయన కారు డోరు ఎదురుగా నేను

నిలుచున్నాను. పక్కనున్న వ్యక్తితో సీరియస్‌గా మాట్లాడుతు నన్ను చూసీ చూడకుండానే వెళ్లిపోయాడు. అప్పుడు ఆయన కారు టైరులో గాలి ఎక్కువగ వున్నట్టువుంది కాస్త స్పీడుకే ఎగిరి ఎగిరి పడుతువుంది.

సత్యాజీ తన ముఖంలో గెలుపు కళను తెచ్చి పెట్టుకుని నిండుగా నవుతువున్నాడు.

కొంత దూరం నడిచి సందు తిరిగానో లేదో స్కూటర్ మీద సత్యాజీ కార్యకర్త ఎదురై నన్ను చూసి "సర్ సత్యాజీ కారు యిటు వెళ్లిందా" బండిని బ్రేక్ చేస్తు అడిగాడు, అతని స్కూటర్‌కు జండా లేదు, వొట్టి కర్ర మాత్రమే వుంది. మనిషి వొగరుస్తు వున్నాడు.

"ఏంటి సంగతి" అడిగాను.

"రెండో నెంబర్ బూతు దగ్గర, రాంరెడ్డి మనుషులు మన వాళ్లను కొట్టారు".

"బయటి వాళ్లా"

"కాదు యిక్కడి వాళ్లే, బాహర్‌పేట చాంద్, చాకలి పెంటయ్య, సురిగి మారయ్యను తల పగలకొట్టారు, సుక్కరాములు చేయి విరిగింది, దవాఖానకు పంపించి ఈ సంగతి చెప్పడానికి నేను వొస్తున్న.

"ఇప్పుడే ఇటు వెళ్లాడు. బహుశ ఇక్కడున్నది పదో బూతు కదా అక్కడ దొరకొచ్చు" అన్నాను

"వస్తు" అంటు గేరు మార్చాడు.

"కొట్టింది మనవాళ్లే, దెబ్బలు పడ్డది మనవాళ్లే, ఏది ఏమైనా యింకా ఎక్కువ పెరగకుండ చూడండి" అన్నాను

బండి కదిలింది. నా తల నిండా ఆలోచనలు.

★ ★ ★

టౌన్ హాల్లో ఓట్ల లెక్కింపు జరుగుతువుంది. కార్లల్లో జీపుల్లో కార్యకర్తల హడావుడి, బయట బండ్ల మీద అరటి పళ్లు గెలలకు గెలలే అయిపోతు వున్నవి. ఎటు చూసినా గ్రౌండంతా వేరు శెనగ కాయల పొట్టే పొట్టు! మధ్యాహ్నం అన్నం పొట్లాళు లోపలికి వెలుతున్నాయి, లోపల ఓట్ల లెక్కింపు జరుగుతూనే వుంది.

అక్కడన్నీ సోడాబుడ్లు, కూల్ డ్రింక్‌లు, చాయగ్లాసులు వాటి సందడిని అవి చేస్తూనే వున్నాయి.

గంట, గంటకి జనంలో ఓ మాదిరి టెన్షన్ పెరుగుతూ వుంది. లెక్కింపు రౌండ్స్ అవుతూ వుంటే జనం ముఖంలో రంగులు మారుతున్నాయి. హాల్ ముందు పెట్టి బోర్డ్ మీద ఎవరెవరికి ఎన్ని ఓట్లు వచ్చాయో రాస్తూనే వున్నారు. వచ్చే పోయే జనం చూస్తూ వున్నారు.

అక్కడ అన్నీ ఆశ్చర్యపు చూపులు, నవ్వు ముఖాలు, అంతే కాదు నోరు మూసుకునే వాళ్ళు. నుదుటికి చేయి పెట్టుకునే వాళ్లు వచ్చిపోతూనే వున్నారు.

ఎవరి ఓట్లు ఎవరికి పోయినయి !

ఏ పార్టీ ఓట్లు మరే పార్టీకి పడినయి !

సాయంత్రం అయ్యింది.

కౌంటింగ్ ముగిసింది.

గెలిచినట్టు యిచ్చిన ధృవ పత్రాన్ని అందుకుని రాంరెడ్డి బయటికి వచ్చాడు. అక్కడే నిలుచున్న శర్మగారు ఎదురెళ్లి కరచాలనం చేసి అభినందనలు చెప్పాడు. రాంరెడ్డి శర్మగారి కడుపు వద్ద తల వంచగ శర్మ నవ్వుతూ అతని తలను నిమిరాడు.

రాంరెడ్డి గారి కార్యకర్తలు ఆయన్ను నేల మీద నడువ నివ్వ లేదు. ఎత్తుకెళ్లి జీపులో కూర్చోబెట్టి గెలుపు నినాదాలు చేస్తు వూరేగింపుగ తీసుకెళుతున్నారు. శర్మగారు తన కార్యకర్తలతో జీపులో తమ పార్టీ కార్యాలయం వైపు వెళ్లాడు. ఆఖర్న హాల్లో నుండి బయటికి వొచ్చిన సత్యాజీ వెంట నలుగురైదుగురు కార్యకర్తలు వున్నారు. మౌనంగానే వెళ్లి కారులో కూర్చున్నారు.

కారు ఇంటి వైపు వెలుతువుంది. మధ్యన చౌరస్తా దగ్గర రాంరెడ్డి ఊరేగింపు బాణాసంచాను పేలుస్తు, మేళతాళాలతో వెడుతూ వుంది. కార్యకర్తలు నినాదాలు చేస్తున్నారు, జనం గుంపులు గుంపులుగా రకరకాల నృత్యం చేస్తున్నారు. బ్యాండు మేళం వాళ్లు హిందీ పాటను వినిపిస్తున్నారు, అందరి కంటే ముందు డప్పులు, కొమ్ములు.

ఓట్లు మనవి, సీట్లు మనవి అన్న చాల మంది ఆ

ఊరేగింపులోనే వున్నారు. కొందరు కోలాటం, మరి కొందరు చిడతల భజన, నుదుట కుంకుమ, వళ్లంతా బుక్క, నవ్వుతూ, త్రుళ్లుతూ జనం నడక.

రాంరెడ్డి చిరు నవ్వుతో చుట్టు చూస్తూ చేతులు జోడించి అందర్కి నమస్కరిస్తున్నాడు. మధ్య మధ్యన పార్టీ కార్యకర్తలు, అభిమానులు పూలమాలలు వేస్తు వున్నారు. అక్కడక్కడ ఊరేగింపును ఆపి బాణా సంచాను కాలుస్తువున్నారు. రాంరెడ్డి తల వంచి అభివాదాలు చెపుతున్నాడు వున్నట్టుండి ఓ అభిమాని పూలదండ కాకుండా నోట్ల దండను తెచ్చాడు.

రాంరెడ్డి కళ్లల్లో కొత్త కాంతులు, ఎంతో వినయంగా వంగి ఆ దండను మెడలో వేయించుకొని ఆ వేసిన వ్యక్తి భుజాలను నిమిరుతు, ఆప్యాయతతో చూశాడు.

ఓట్లు, సీట్లే, కాకుండా నోట్లు గూడ రావడం చూసిన సత్యాజీ అసహనంగా కదులుతూ "డ్రైవర్ కారును మరో రోడ్డుకు మళ్లించు" అన్నాడు. కారు కొంత దూరం వెనక్కు వెళ్లి పక్క రోడ్డు వెంట పరుగెత్తుతూ వుంది.

"ఓట్లు మావి - సీట్లు మావే" అన్న నినాదం పదే, పదే గుర్తుకు రాసాగింది.

★ ★ ★

అది కాలేజీ ఆవరణ, ఒపెన్ స్టేజీ, దాని ఎదురుగా కుర్చీలు, స్టేజీ మీదికి వెళ్లడానికి మధ్య నుండి తోవను వదిలారు. పత్రిక వాళ్ళ కోసం ప్రత్యేకం.

"రాష్ట్ర దళిత సాహితీ సభలు" అనే బ్యానరును వేదికపై కట్టారు. అన్ని సాహితీ సభలకు వచ్చినట్టె జనం ఆ సభకు వచ్చారు. సభాధ్యక్షులు, ఇతర కవి పండితులు సభను అలంకరించి వున్నారు. సభా ప్రారంభాన్ని నేనే చేయవల్సి వుంది.

"సభకు నమస్కారం, సభాధ్యక్షులు, వేదిక నలంకరించిన సాహితీ స్రష్టలు, మరియు సభలోని సాహితీ మిత్రులు, సోదరీ సోదరులారా, విద్యార్థులారా !

మనం ఆలోచనలను పంచుకోవడానికి ఈ సభలు జరుపుకుంటున్నాం. ముందుగా మనం ఎటుపోతున్నామో పరిశీలించుకోవల్సి వుంది. ఎటు పోవాలో ఆలోచించుకోవల్సి వుంది. మన వెనకబడిన కులాల పితామహుడు డా॥ అంబేద్కర్ పొందు పర్చిన రిజర్వేషన్లు అందుకుంటున్నాం, అనుభవిస్తున్నాం. కానీ ఆయన పిలుపును మరచిపోయాం, ఆయన ఆలోచనలను ఆచరించలేక పోతున్నాం.

సభలో చప్పట్లు.

"ఎడ్యుకేట్, ఆర్గనైజ్, ఎజిటేట్"

ఎడ్యుకేట్ - నిన్ను నీవు తెలుసుకొని, నీ చుట్టూర వున్న వాళ్ల గూర్చి తెలుసుకొని మసలటం.

చైతన్యవంతులను చేయటం

ఆర్గనైజ్ - దళితులంతా ఏకమై సర్వశక్తులను సమీకరించుకుని నడవమని, నలుగురితో కలిసి నడుస్తూనే మరి నలుగురు నీ

వెంట నడిచేట్టు నడువుమని.

ఎజెటేట్ - సిద్ధాంతపరంగా వాదోప వాదాలతో స్వార్థ సంస్కృతిని, దుర్నీతిని వ్యతిరేకిస్తు, సాంఘికన్యాయాన్ని సాధించడానికి, పోరాడమని.

మరి సోదరులారా ? ఒక్కసారి ఆలోచించండి.

మనం ఎక్కడ ఆచరిస్తున్నాం, ఆ మహానుభావుడు చెప్పినట్టు మనం ఆచరిస్తే, మనల ఈ దుర్గతి ఎందుకు వెంటాడుతుందీ ? ఈ దుస్థితి ఎందుకింకా మనలను అంటి పెట్టుకునే వుంటుందీ ఆలోచించండి !

మొన్న జరిగిన ఎన్నికల్లో అంబేద్కర్ ఆలోచనల స్ఫూర్తితోనే కదా ఓ కొత్త పార్టీని పెట్టుకుని ఎన్నికల్లో పోటి పెట్టింది ?

మరి రిజల్ట్స్ ? రాష్ట్రంలో ఒక్క అభ్యర్థైనా గెలిచాడా ? ఎందుకు? ఎందుకు?

"ఓట్లు మనవి - సీట్లు మనవి అన్నాం. కనీసం డిపాజిటన్న వాపస్ రాలేదే ! ఎందువల్ల ?"

"ప్రాంతీయ పార్టీ హవా" జనంలో నుండి కేక.

"అన్ని హవాలకు నిలిచేదే ఐక్యత. నిజాయితీగల ఆర్గనైజేషన్ సోదరా ! అదే మన మధ్య కరువైందని అందుచేత మనం ఏం మాట్లాడు కుంటున్నామో, ఎటు పోతున్నామో మరోకసారి ఆలోచించమంటూ నాకీ అవకాశం కల్పించిన నిర్వాహకులకు కృతజ్ఞతలు చెపుతూ శెలవు" అంటు కూర్చున్నాను.

ఆ తరువాత ఓ అభ్యుదయ రచయిత మాట్లాడుతూ మార్క్సిజం ఒక్కటే దళితులకు మార్గమన్నాడు.

ఆ తరువాత ఓ విప్లవ కవి మాట్లాడారు. విప్లవ కవిత్వంలోనే దళిత స్పృహ వుంది అని, తమ కవితా సంకలనాన్ని కోటేశ్‌కు అంకిత మిచ్చాం అన్నాడు.

కొందరు యువకులు దళిత గీతాలు పాడారు. రెండవ సమావేశం రేపు ఉదయం అని ప్రకటించారు.

అప్పటికి ఆ సమావేశం ముగిసింది.